
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 51.235 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారం 51.235 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.99,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,994
3శాతం జీఎస్టీతో	రూ.9,264
నవర (8గ్రా)	రూ.74,112

గరిష్టం/కనిష్టం
37.8 /27.4

వాతావరణం
జిల్లాలో బుధవారం పొడి వాతావరణం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకునిగా జంకె



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకునిగా నియమించినట్లు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొంది. జంకె వెంకటరెడ్డి గతంలో ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా పనిచేశారు. రెండుసార్లు మార్కాపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ చైర్మన్గా పనిచేశారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జెడ్పీ సీఈఓ విద్యారమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా పరిషత్, మండల పరిషత్ అంచనా బడ్జెట్‌లపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సెలవుపై వెళ్లిన ఫిషరీస్ జేడీ

నెల్లూరు (పొగతోట): ఫిషరీస్ జేడీ నాగేశ్వరరావు నెల రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఆరోగ్య రీత్యా ఆసుపత్రిలో చెకప్ నిమిత్తం సెలవులో వెళ్లినట్లు సమాచారం. విజయవాడలో పనిచేస్తున్న ఫిషరీష్ జేడీ కె.శాంతికి నెల్లూరు జేడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో మే 1వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ ఓ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు మంగళవారం డివిజనల్ అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్, ఎస్పీలు, పోలీస్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నెల్లూరుపాళెం గిరిజనకాలనీ వద్ద సీఎం స్వయంగా పింఛన్ అందజేసే ఇంటిని, గిరిజనకాలనీని వారు సందర్శించారు. ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా భవన నిర్మాణ కార్మికులతో సీఎం మాట్లాడనుండడంతో అక్కడ పరిస్థితులు పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కో అధికారిని పర్యవేక్షణకు నియమిస్తూ కలెక్టర్ వారికి బాధ్యతలు అప్పగించారు.

స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో 2019 సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిర్మించి ఉండి అభ్యంతరం లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వైఓ నందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల అభ్యర్థుల మేరకు అభ్యంతరాల్లేని నివాసాలను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలియజేశారు. నివాస హక్కులను పొందాలని కమిషనర్ సూచించారు. అన్ని డివిజన్లలో నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలంతా స్వచ్ఛందంగా సహకరించి సంబంధిత వార్డు సచివాలయాల్లోని వీఆర్వోల లాగిన్‌ల ద్వారా దాఖలు చేసుకోవాలన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. వేలానికి 781 బేళ్లు రాగా, 593 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సగటున రూ.252.46 ధర పలికిందని వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280 పలికింది. వేలానికి రైతులు 571 బేళ్లను తీసుకురాగా, 471 బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి నివేశ్‌కుమార్ పాండే తెలిపారు.

రాత్రిళ్లు.. ఇసుక తోడేళ్లు..

మంత్రి నారాయణ అండతో బరితెగింపు

నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ అండతో తెలుగు తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. సహజ వనరులను దోపిడీ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. రాత్రయితే చాలు పెన్నా గర్భాన్ని తోడేస్తూ భారీ సంఖ్యలో వాహనాలతో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా నిలువరించే సాహసం చేయడం లేదు. నెలవారీ మామూళ్లకు కక్కుర్తిపడి మౌన నిద్ర నటిస్తున్నారు.



రీచ్ వద్ద ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

- నిత్యం 50 వాహనాల్లో అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికార గణం
- షాడో మంత్రి తీరుపై నుడా చైర్మన్ గుర్రు
- అర్ధరాత్రి వేళ పెన్నాలో హడావుడి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పెన్నాలో ఇసుక దోపిడీ తీరుపై చాలాకాలంగా ప్రతిపక్షాలు గగ్గోలుపెడుతున్నా.. పత్రికల్లో కథనాలు వస్తున్నా తెలుగు తమ్ముళ్లు చెవికెక్కించుకోవడం లేదు. టీడీపీలో నెలకొన్న అంతర్గత విభేదాలతో ఆపార్టీ నేతలే సహజ వనరుల దోపిడీని సోమవారం రాత్రి వెలుగులోకి తేవడం జిల్లాలో చర్చనీయాంశమైంది. మంత్రి నారాయణ ఇలాకాలో జరుగుతున్న ఇసుక దోపిడీ తీరును నుడా చైర్మన్ అడ్డుకోవడం చూసి నగర ప్రజలు విస్తుపోతున్నారు.

భారీ యంత్రాలతో తోడేస్తూ..

నగర నియోజకవర్గ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్ వద్ద మంత్రి నారాయణ అండతో టీడీపీ నేతలు అనధికారికంగా రీచ్‌ను ప్రారంభించారు. నేరుగా రీచ్ వద్దకే కార్పొరేషన్ నిధులతో రహదారిని ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక విధానం ముసుగేసి పగటి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. రాత్రయితే చాలు టీడీపీ నేతలు వారి అనుచరవర్గం హిటాచి లాంటి యంత్రాలు పెట్టి పెన్నా నదిని కుళ్లబొడుస్తున్నారు. దీనదయాళ్‌నగర్ ప్రాంతంలో భారీ వాహనాల రణగొణ ధ్వనులతో ఆప్రాంత ప్రజలకు కునుకు లేకుండా పోతోంది. రోజువారీ 50 భారీ వాహనాలతో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. లోడింగ్ ఛార్జీల పేరుతో తమ్ముళ్లు లారీకి రూ.8 వేలు వంతున వసూలు చేస్తున్నారు. అంటే లోడింగ్ ద్వారానే దాదాపు రోజువారీగా దాదాపు రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో వాహనానికి 30 టన్నుల లోడింగ్ జరుగుతుంది. అలా లెక్కించిన రోజుకు 1500 టన్నుల ఇసుక అనధికారికంగా రవాణా అవుతోంది. నెలవారీగా 45 వేల టన్నుల ఇసుక రవాణా సాగిస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా ఈ తంతు జరుగుతోంది.

మామూళ్ల మత్తులో అధికారులు

రాత్రి వేళ పెన్నాలో తెలుగు తమ్ముళ్లు ఇసుక దోపిడీ చేస్తుంటే అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నగర పరిధిలోనే తమ్ముళ్లు బరితెగించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు కళ్లకు గంతలు కట్టుకోవడం వెనుక మామూళ్ల వ్యవహారమే కారణమని తెలుస్తోంది. మైనింగ్, రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

మంత్రికి తెలియదా..?

నగరంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో ఇసుక దోపిడీ మంత్రి నారాయణకు తెలియకుండానే జరుగుతుందా? అనే సందేహం స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఒకవేళ తన సొంత నియోజకవర్గంలో జరిగే దోపిడీ గురించి తెలిస్తే మంత్రి ఎందుకు మౌనం వహించారనేది ప్రశ్నార్థకరం. జిల్లాలో ఎక్కడా ఇసుక దోపిడీ లేదని బుకాయించే మంత్రి తన అడ్డాలోనే అర్ధరాత్రి వేళ ఇసుక దోపిడీ జరుగుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ఆ పార్టీ క్యాడరే ప్రశ్నిస్తోంది.

టీడీపీకి చెడ్డపేరు తెచ్చేవారిని ఉపేక్షించను

నెల్లూరు సిటీ: నగరంలోని 3వ డివిజన్ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్‌కు సమీపంలో పెన్నా నది ఇసుక రీచ్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌లను టీడీపీ నేత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారిపై మండిపడ్డారు. దాదాపు నాలుగు గంటల పాటు హైడ్రామా సాగింది. రూరల్ తహసీల్దార్ లాజరస్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వేణు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ టీడీపీకి చెడ్డపేరు తెచ్చే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దీని వెనుక ఇసుక స్మగ్లర్‌లు ఎవరున్నా ఉపేక్షించనన్నారు. మంత్రి నారాయణ డీఎస్పీ, ఎస్పీకి ఫోన్ చేసి దోషులను వదిలిపెట్టవద్దని చెప్పారన్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న రెండు టిప్పర్‌లు, ఒక హిటాచీని రూరల్ పోలీసులు సీజ్ చేశారు. మూడు వాహనాల డ్రైవర్‌లపై కేసు నమోదు చేశారు.



ఇసుక రీచ్‌ల వద్ద నిర్వాహకులను ప్రశ్నిస్తున్న శ్రీనివాసులురెడ్డి



ఇసుక తరలిస్తున్న టిప్పర్ డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న శ్రీనివాసులురెడ్డి

కోటంరెడ్డి హడావుడి వెనుక..

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దీన్‌దయాళ్ నగర్‌లో జరిగే ఇసుక దోపిడీపై సోమవారం అర్ధరాత్రి కన్నెర్ర చేసి అడ్డుకున్నారు. రాత్రంతా రీచ్‌లోనే జాగారం చేసి అధికారులను పిలిపించుకునే వరకు ఉన్నారంటే ఆయన చూపిన తెగువ అభినందించదగిందే. గతంలో ప్రతిపక్షం ఇదే విషయమై ప్రశ్నిస్తే.. ఖండించే అధికార పార్టీ నేతలే కూటమి ప్రభుత్వంలో జరిగే సహజవనరుల దోపిడీని వెలుగులోకి తేవడం విశేషం. కోటంరెడ్డి హడావుడి వెనుక ఆ పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరే కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం నెల్లూరు నగర నియోజకవర్గం అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారం అంతా మంత్రికి అత్యంత సన్నిహితుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి చూస్తున్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డిని పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో మంత్రి తీరుపై కోటంరెడ్డి లోలోన రగిలిపోతున్నాడు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న తనను కాదని వేమిరెడ్డికి బాధ్యతలు అప్పగించడం జీర్ణించుకోలేని కోటంరెడ్డి ఇసుక దోపిడీ వ్యవహారంలో మంత్రిని బదానం చేసేందుకు అర్ధరాత్రి వేళ హడావుడి చేశారని అంటున్నారు.

నేడు పాలిసెట్

- జిల్లాలో 10 కేంద్రాల్లో
- హాజరుకానున్న 4074 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పాలిసెట్ కోఆర్డినేటర్ ఏసుదాసు తదితరులు

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష బుధవారం నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం పది కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. నెల్లూరు కోఆర్డినేటర్ సెంటరు పరిధిలో వీఆర్ పీజీ కళాశాలలో 728 మంది, నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో 671, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో 500, డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో 350, వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో 350 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఆత్మకూరు కోఆర్డినేటర్ సెంటరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 400, ప్రభుత్వ హైస్కూల్‌లో 127, కావలి కోఆర్డినేటర్ సెంటరు పరిధిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 299, పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలలో 297, కందుకూరు కోఆర్డినేటర్ సెంటరు పరిధిలో కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 351 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. 10 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 12 మంది అబ్జర్వర్లను నియమించారు. పరీక్ష జరుగు సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు (పొదలకూరు): ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు ప్రాజెక్టు ఇంజినీర్లు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 460, 2వ యూనిట్లో 565, 3వ యూనిట్లో 630 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు వెల్లడించారు.

ట్రేడ్ లైసెన్స్.. సైలెన్స్

- ఆదాయం పెంపుపై దృష్టిపెట్టని అధికారులు
- ముందుకురాని వాణిజ్య సంస్థల యజమానులు
- పునరుద్ధరణపైనా సిబ్బంది నిర్లక్ష్యమే
- చిత్తశుద్ధి లేని కార్పొరేషన్ యంత్రాంగం



నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధానరోడ్లతో సహా కాలనీల్లో ఇబ్బడి ముబ్బడిగా వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు వెలుస్తున్నా.. ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల జారీ జరగటం లేదు. సంబంధిత వ్యాపారులు కూడా ట్రేడ్ లైసెన్సులపై శ్రద్ధ చూపడం లేదు. వ్యాపార వాణిజ్య సముదాయాలు, దుకాణాలు నడపాలంటే నిబంధనల ప్రకారం నగర పాలక సంస్థకు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సుకు వ్యాపారులు తగిన రుసుము చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే వాణిజ్య, వ్యాపార సముదాయాల యజమానులు చాలామంది ట్రేడ్ లైసెన్సులు తీసుకోవడం లేదు. దీంతో కార్పొరేషన్ ఆదాయాన్ని కోల్పోతోంది.

పన్నుల మదింపులో తేడాలు

నగర పరిధిలో విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాలకు సంబంధించిన పన్నుల మదింపులో కూడా తేడాలు కోకొల్లలుగా ఉన్నాయి. దీంతో కార్పొరేషన్‌కు ఏటా పెద్ద ఎత్తున రావలసిన ఆదాయానికి గండి పడుతోంది. దీనికి ప్రధాన కారణం నగర పాలక సంస్థలోని కొంత మంది సిబ్బంది అవినీతి, అక్రమాలకు తలొగ్గటమేనన్న ఆరోపణలున్నాయి.

వ్యాపారం ఆధారంగా

నగర పాలక సంస్థ పరిధిలో వ్యాపారం నిర్వహించుకునేందుకు విస్తీర్ణంతో సంబంధం లేకుండా చేస్తున్న వ్యాపారాన్ని బట్టి ఫీజులు చెల్లించాల్సి ఉంది. నిత్యావసర సరుకులు, ఆసుపత్రులు, హోటళ్లు, విద్యాసంస్థలు ఇలా అనేక రకాల వాణిజ్య, వ్యాపారాలకు సంబంధించి స్థాయిని బట్టి రూ.300 నుంచి రూ.40వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపారస్తులు కార్పొరేషన్ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకుని ఏటా నిర్దేశించిన ఫీజు చెల్లించాల్సి ఉండగా చాలా మంది దుకాణాల నిర్వాహకులు లైసెన్సులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఏటా ఏప్రిల్‌లో దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సును పునరుద్ధరించుకోవాలని అధికారులు చెబుతున్నా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు.

ఎన్ఎంసీ పరిధిలో పరిస్థితి ఏంటంటే..

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వ్యాపార, వాణిజ్య సముదాయాలకు సంబంధించి 11,560 ట్రేడ్ లైసెన్సులున్నాయి. వీటి నుంచి ఏటా రూ.4,33,32,805 వసూలు కావాల్సి ఉంది. అయితే 2024–25 సంవత్సరానికి గాను రూ.2,09,05,595 వసూలైంది. ఇంకా రూ.2,24,27,210 వసూలు కావాల్సి ఉంది. ఇది అధికారిక గణాంకాలు. వాస్తవానికి ఇంతకు రెండింతలుగా కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నెల్లూరు నగరంలో వ్యాపార దుకాణాలు దాదాపు 25వేలకు పైగా ఉండవచ్చని అంచనా. పూర్తిస్థాయిలో గనుక పరిశీలించి వాణిజ్య, వ్యాపార సముదాయాలను గుర్తించగలిగితే ట్రేడ్ లైసెన్సులు లేనివి వేల సంఖ్యలో బయటపడే అవకాశం ఉంటుంది. వాటన్నింటికి ట్రేడ్ లైసెన్సులు జారీ చేసినట్లయితే ఎన్ఎంసీకి ప్రస్తుతం వస్తున్న ఆదాయం రెండింతలు పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

విలీన పంచాయతీల్లోనూ అంతే

నగర పాలక సంస్థ పరిధిలో విలీన గ్రామ పంచాయతీల్లో పెద్ద ఎత్తున దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉన్నాయి. గతంలో ఉన్నవాటికి రెట్టింపు సంఖ్యలో కొత్తగా దుకాణాలు, వాణిజ్య, వ్యాపారసంస్థలు వెలిశాయి. చాలా వాటికి ట్రేడ్ లైసెన్సులు పొందకుండానే వ్యాపార సముదాయాలను నిర్వహిస్తున్నారు. ఎన్ఎంసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా కార్పొరేషన్‌లో మరింత ఆదాయం పెంచాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, కిరాణా దుకాణాలు, సెల్‌పాయింట్లు, మొబైల్ షోరూంలు, వస్త్రదుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు తదితర వాణిజ్య సంస్థలు భారీగా పెరిగిపోయాయి. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగిపోతున్నా.. చాలామంది నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందడం లేదు. దీంతో ఎన్ఎంసీ ఆదాయానికి రూ.కోట్లలో గండిపడుతోంది.

జీజీహెచ్‌లో ఆరుగురు పారిశుధ్య సిబ్బందిపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



నెల్లూరు(అర్బన్): రోగుల సహాయకులపై అనుచితంగా ప్రవరిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆరుగురు పారిశుధ్య సిబ్బందిపై నగరంలోని సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ చర్యలు తీసుకున్నారు. శనివారం ఐపీ భవనంలో రెండో అంతస్తులో అడ్మిషన్‌లో ఉన్న పెంచలయ్య అనే రోగి కుటుంబ సభ్యురాలు విజయలక్ష్మి బాత్‌రూంలు సరిగా లేవని అక్కడ పనిచేస్తున్న రేవతికి తెలిపింది. ఈ క్రమంలో వాదనలు చోటు చేసుకున్నాయి. రెండో రోజు ఉదయం ఆస్పత్రి గేటు వద్ద రోగి కుటుంబ సభ్యురాలు విజయలక్ష్మిని పలువురు పారిశుధ్య కార్మికులు చుట్టుముట్టారు. ఈ విషయమై సోమవారం పెద్దాసుపత్రిలో సిబ్బంది దాష్టీకాలు శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి సూపరింటెండెంట్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ విషయంతో పాటు ఆస్పత్రిలో తరచూ చోటు చేసుకుంటున్న ఇలాంటి మరికొన్ని విషయాలు పరిగణనలోనికి తీసుకున్న సూపరింటెండెంట్ మంగళవారం అందుకు కారకులైన పారిశుధ్య సిబ్బంది రేవతి, ధనమ్మ, బీబీజాన్, శైలజ, అమల, యాలమ్మలను వారం రోజుల పాటు విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కూడా సిబ్బంది ఇచ్చే వివరణ బట్టి వారికి విధులు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు.

‘ఉపాధి’లో అవినీతిపై విచారణ



వివరాలు సేకరిస్తున్న అధికారులు

సైదాపురం: ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ, ఇష్టారాజ్యంగా జాబ్‌కార్డులు అందించి నిధులు కాజేస్తున్నారంటూ సైదాపురం మండలం రాగనరామాపురం సర్పంచ్ ఊసా నరసమ్మ ఆరోపించారు. ఒక్కో ఇంట్లో మూడు, నాలుగు జాబ్‌కార్డులు ఉన్నాయని, పనులకు రానివారి పేర్ల మీద మస్టర్ రాసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారి డి.విజయలక్ష్మి, ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాగనరామాపురంలో విచారణ చేపట్టారు. ఉపాధిలో భారీగా అక్రమాలు బహిర్గతమైనట్లు తెలిసింది. నకిలీ పేర్లతో ఉపాధి నిధులు డ్రా చేసినట్లు వెల్లడైనట్లు సమాచారం. దీనిపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. విచారణలో ఏపీఓ సురేంద్ర, కార్యదర్శి మాధవీలత పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి ధ్యాన, యోగా ఉచిత శిక్షణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి వేసవి ధ్యాన, యోగా ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా శిక్షకులు ముత్యాల రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని స్వతంత్ర్య పార్కులో జరిగే ఈ శిక్షణా శిబిరంలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, ఈ శిక్షణా శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9440738171, 6301271792 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పరీక్షలకు 28 మంది హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 28 విద్యార్థులు హాజరయ్యారని వీఎస్‌యూ ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 31 మందికి ముగ్గురు గైర్హాజరయ్యారని తెలిపారు.

రేపు జిల్లా స్థాయి చెస్ ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి అండర్–9 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు, ఎంపికలను గురువారం నగరంలోని పొగతోటలోని రాయ్ చెస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 1–1–2016 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 96033 45326 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులు

ఉదయగిరి రూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడి నిధులు దుర్వినియోగం చేసిన ఉద్యోగులు, సిబ్బందిపై కలెక్టర్ ఉత్తర్వుల మేరకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డ్వామా పీడీ బి.గంగాభవానీ ఆదేశాలు జారీ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో జరిగిన ఉపాధి పనులపై 17వ విడత సామాజిక తనిఖీ గత నెలలో చేపట్టారు. తనిఖీల్లో ఉద్యోగులు, సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ఏపీఓ, ఈసీ, టీఏలతోపాటు ఎఫ్ఏలు మొత్తం కలిపి 21 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు దుర్వినియోగం చేసిన నిధులు రూ.47,62,832లు రికవరీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయని ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు.

నూరు శాతం ఫలితాలకు కృషి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీసీఓ, డీడీ

సంగం: గురుకుల పాఠశాల విద్యార్థినులు, వసతి గృహ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ కల్పించడం ద్వారా నూరు శాతం ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నట్లు డీసీఓ టీ పద్మజ, సోషల్ వెల్ఫేర్ డీడీ కె.శోభారాణి తెలిపారు. సంగం గురుకుల కళాశాలను మంగళవారం వారు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్, 10వ తరగతి ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థినులకు సంగం గురుకుల పాఠశాలలో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షను నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి ఈ క్యాంప్‌కు హాజరైన విద్యార్థినులతో డీసీఓ టీ పద్మజ, సోషల్ వెల్ఫేర్ డీడీ కె శోభారాణి మాట్లాడారు. వారిలో ధైర్యం నింపి ప్రోత్సహించారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకుంటే ఉన్నత శిఖరాలను సులభంగా చేరుకోవచ్చునని, వారి అనుభవాలను విద్యార్థినులతో పంచుకొని వారిలో ఆసక్తిని, ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సుమతమ్మ ఉన్నారు.

కండలేరులో 45.318 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారానికి 45.318 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 220, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 105
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 192
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 212
లేయర్ చికెన్ : 170



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.95
సన్నవి : రూ.65
పండ్లు : రూ.40



రేపటి నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన గ్రామీణ, మండల, జిల్లా కేంద్రాల్లో మొత్తం 50 శిక్షణా శిబిరాలను నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు వ్యాయామ విద్య, ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులతోపాటు జిల్లా కేంద్రంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సంబంధిత క్రీడా శిక్షకులతో ప్రాథమిక స్థాయి నుంచి వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ శిబిరాల్లో క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ అందిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

వేసవిలో నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణా శిబిరాలను జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలి. వేసవి శిక్షణా శిబిరాల్లో క్రీడా ప్రస్థానం ప్రారంభించిన చిన్నారులు భవిష్యత్‌లో ఎంతో మంచి క్రీడాకారులుగా ఎదిగారు. ఆయా క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, తమ ప్రాంతాల్లో చిన్నారులు ఈ శిక్షణా శిబిరాలకు హాజరయ్యేలా సహాయ సహకారాలు అందించాలి.

– ఆర్‌కే యతిరాజ్, డీఎస్‌డీఓ



క్రీడ	శిక్షణా శిబిరాలు
1. అథ్లెటిక్స్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు
2. ఆర్చరీ	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు
3. హాకీ	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు
4. స్విమ్మింగ్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు
5. బ్యాడ్మింటన్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు, యూత్ క్లబ్, ఏలూరుపాడు, గుడ్లూరు
6. బాస్కెట్ బాల్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు, వీఆర్ కాలేజ్, జేబీ కాలేజ్, విట్స్ కాలేజ్ కావలి
7. ఫుట్‌బాల్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు, సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, నెల్లూరు, సెయింట్ పీటర్స్ స్కూల్, సంతపేట నెల్లూరు, జెడ్పీ హైస్కూల్, ఉలవపాడు, ఇంటర్మీడియట్ కాలేజ్, కందుకూరు, పాలిటెక్నిక్ కాలేజ్, వెంకటేశ్వరపురం, కొత్తూరు, నెల్లూరు రూరల్, బిట్రగుంట గ్రౌండ్స్, కావలి, కలివెలపాళెం, మహ్మదాపురం
8. కబడ్డీ	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు, జెడ్పీ హైస్కూల్, దమ్మాయపాళెం, ముత్తుకూరు, కావలి, కరేడు
9. ఖోఖో	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, నెల్లూరు, బీవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్, నవాబుపేట, నెల్లూరు, జెడ్పీ హైస్కూల్ దమ్మాయపాళెం, ముత్తుకూరు, ఎంవీఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్ నర్సాపురం, ఇందుకూరుపేట
10. వాలీబాల్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు, ఎన్‌టీఆర్‌నగర్ పార్కు, నెల్లూరు, సర్వోదయ డిగ్రీ కాలేజీ, నెల్లూరు, మున్సిపల్ స్కూల్ రంగనాయకులపేట, నెల్లూరు, జవహర్‌భారతి డిగ్రీ కాలేజీ, కావలి
11. క్రికెట్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు, కొత్తపల్లి, అనంతసాగరం, సీతారామపురం
12. సాఫ్ట్‌బాల్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, గవర్నమెంట్ హైస్కూల్, ఆత్మకూరు
13. చెస్	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, నెల్లూరు
14. తైక్వాండో	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, నెల్లూరు, జెడ్పీ హైస్కూల్, విశ్వనాథరావుపేట బోగోలు
15. యోగా	ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు, బారకాసు లైబ్రరీ,పెద్దబజారు, ఏబీఎంఎస్ స్కూలు, బీవీనగర్, స్వతంత్ర పార్కు, గాంధీబొమ్మ సెంటర్, ఎన్‌టీఆర్ పార్కు అన్నమయ్య సర్కిల్, నెల్లూరు
16. బాల్ బ్యాడ్మింటన్	జవహర్ భారతి డిగ్రీ కాలేజ్, కావలి
17. నెట్‌బాల్	జెడ్పీ హైస్కూల్, పాటూరు, కోవూరు
18. రోలర్ స్కేటింగ్	చిల్డ్రన్స్ పార్కు, నెల్లూరు
19. సపక్‌తక్రా	ఎలిమెంటరీ హైస్కూల్, ఎన్‌వీ గార్డెన్స్ నెల్లూరు, జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్స్, కొత్తూరు, ఇందుకూరుపేట
20. టెన్నిస్	శ్రీధర్ టెన్నిస్ అకాడమీ, నెల్లూరు, జవహర్‌భారతి డిగ్రీ కాలేజ్, కావలి,
21. ఫెన్సింగ్	రెయిన్‌బో స్కూల్ బుచ్చిరెడ్డిపాళెం

ఇద్దరిని బలిగొన్న అతివేగం



ఘటనా స్థలంలో మృతదేహాలు



మృతులు మన్సూర్, ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

• అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

బిట్రగుంట: అతి వేగం ఇద్దరు స్నేహితుల ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన కొడవలూరు మండలం నార్తురాజుపాళెం సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద హైవేపై సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. బోగోలు పంచాయతీ బేతనీయపేటకు చెందిన షేక్ మన్సూర్‌బాషా (26), విశ్వనాథరావుపేట రామస్వామిపాళెంకు చెందిన బత్తుల ప్రవీణ్‌కుమార్ (26) చిన్ననాటి నుంచి స్నేహితులు. మన్సూర్‌కు వివాహమై రెండేళ్ల కుమారుడు ఉండగా, ప్రవీణ్‌కుమార్ అవివాహితుడు. మన్సూర్ బిట్రగుంటలోనే వాహనాలకు నేమ్ బోర్డులు, స్టిక్కర్లు వేసే షాపు నిర్వహిస్తున్నాడు. ప్రవీణ్‌కుమార్ గౌరవరం టోల్ ప్లాజా వద్ద పని చేస్తున్నాడు. స్నేహితులిద్దరూ పని మీద సోమవారం నెల్లూరు వెళ్లారు. రాత్రి సుమారు 11.30 గంటల తర్వాత బైక్‌పై ఇంటికి బయలుదేరారు. బాగా ఆలస్యం కావడంతో త్వరగా ఇంటికి చేరుకొందామని బైక్‌ను వేగంగా నడుపుకొంటూ వచ్చారు. 12 గంటల ప్రాంతంలో నార్తురాజుపాళెం ఆంజనేయస్వామి గుడి వద్ద ఆగి ఉన్న లారీని అదే వేగంతో వెనుక వైపు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న స్నేహితులు మన్సూర్, ప్రవీణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఏఎస్సై గంధం ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు. అనంతరం ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్): తనతో సహజీవనం చేస్తున్న మహిళను చీరతో ఉరేసి హత్య చేసినట్లు నమోదైన కేసులో బోగోలు మండలం తెల్లగుంటకు చెందిన నిందితుడు గుత్తి యాకోబ్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.2000 జరిమానా విధిస్తూ 8వ అదనపు (ఇన్‌చార్జి) జిల్లా కోర్టు న్యాయమూర్తి జి. గీత మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కొడవలూరు మండలం మిక్కిలింపేట గ్రామానికి చెందిన కరేటి పిచ్చయ్య కుమార్తె శ్యామలకు టీపీగూడూరు మండలం ఇరకానిపల్లి గ్రామానికి చెందిన చిరంజీవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. అభిప్రాయ బేధాలు రావడంతో భర్తను పిల్లలను వదిలేసి శ్యామల పుట్టింటికి చేరింది. కొంత కాలానికి భర్త చనిపోయాడు. శ్యామల హోటల్‌లో పనిచేయడం, కీలు గుర్రాల ప్రదర్శనలు చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేది. ఈ నేపథ్యంలో బోగోలు మండలం తెల్లగుంట గ్రామానికి చెందిన యాకోబుకు శ్యామలతో హోటల్‌లో పరిచయం ఏర్పడింది. కాలక్రమేణా సహజీవనం చేస్తూ అతని ఇంట్లోనే ఉండేది. ఈ నేపథ్యంలో శ్యామలపై అనుమానం పెంచుకున్నాడు. 2021 సెప్టెంబర్ 16న ఉదయం శ్యామలతో గొడవ పడిన యాకోబు చీరతో ఉరేసి హత్య చేసి పరారయ్యాడు. మృతురాలు తండ్రి పిచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బిట్రగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడి యాకోబ్‌పై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎంకే విజయలక్ష్మి కేసు వాదించారు.

ఆన్‌లైన్ ద్వారా లీగల్ మెట్రాలజీ సేవలు

• రీజినల్ జాయింట్ కంట్రోలర్ మాధురి



మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ అధికారి

నెల్లూరు(అర్బన్): లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతలు) శాఖకు సంబంధించిన సేవలన్నీ ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించాలని ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎన్ఎస్ మాధురి తెలిపారు. మంగళవారం నెల్లూరు, బాపట్ల, ఒంగోలుకు చెందిన పలువురు ఎంటర్ ప్రెన్యూర్లతో నగరంలోని ఐఎంఏ హాల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీకి సంబంధించిన అన్ని రకాల సేవలను ఏపీ ఇండస్ట్రియల్ పోర్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉపయోగించుకోవాలన్నారు. లీగల్ మెట్రాలజీకి ప్రత్యేకించి వెబ్‌సైట్ లేకపోవడంతో ఇండస్ట్రియల్ పోర్టల్‌ను వినియోగించుకోవాలన్నారు. అధికారులు సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కాటాలకు సంబంధించి లోపాలున్న చోట మరమ్మతులు చేయించి స్టాంపింగ్ చేయాలన్నారు. పాన్ కార్డు, ఆధార్ కార్డుల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పారదర్శకత కోసం పక్కాగా వివరాలు నమోదు చేయాలన్నారు. అన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్, అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులను సహించం

• నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం): వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం, రాపూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని, అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు కల్యాణి, వహీదా, సుకన్య, ఆరంబాకం శ్రీనివాసులు, ఆరి శంకరయ్య, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం మండల కన్వీనర్లు వెందోటి మధుసూదన్‌రెడ్డి, మన్నారపు రవికుమార్‌యాదవ్, చింతల శ్రీనివాసులరెడ్డి, నేతలు పూజారి శ్రీనివాసులు, మల్లిరెడ్డి, పేచిరాజ్, అల్లంసాయి, యస్దానీబాషా పాల్గొన్నారు.

దివ్యాంగ టీచర్లకు సదరం కష్టాలు



పెద్దాస్పత్రికి వచ్చిన దివ్యాంగ ఉపాధ్యాయులు

నెల్లూరు(అర్బన్): త్వరలోనే ఉపాధ్యాయుల బదిలీలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో జరిగే కౌన్సెలింగ్‌లో దివ్యాంగులకు అదనపు మార్కులు వస్తాయి. అయితే వీరి సదరం సర్టిఫికెట్లను పెద్దాస్పత్రిలో మరో దఫా రీవెరిఫికేషన్ చేయించిన సందర్భంలో పలువురు దివ్యాంగ ఉపాధ్యాయులకు గతంలో ఉన్న వికలత్వ శాతాన్ని చాలా వరకు తగ్గించారు. ఒక ఉపాధ్యాయుడికి గతలో 85 శాతం సదరం సర్టిఫికెట్ ఇవ్వగా, దాన్ని ఇప్పుడు 60 శాతానికి తగ్గించారు. మరో ఉపాధ్యాయుడికి 50 శాతం సదరం సర్టిఫికెట్ ఉండగా ప్రస్తుతం 30 శాతానికి కుదించారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ అధికారులు ఆ ఉపాధ్యాయులను పెద్దాస్పత్రి వెళ్లాలని సూచించారు. దీంతో సోమవారం పెద్దాస్పత్రికి వచ్చి అక్కడి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌ను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. దీంతో సూపరింటెండెంట్ మరోసారి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయించి పరిశీలన చేయిస్తానని తెలిపారు. అందుకు మంగళవారం రావాలని సూచించారు. దీంతో వెళ్లిపోయిన దివ్యాంగ ఉపాధ్యాయులు మంగళవారం పెద్దాస్పత్రికి వచ్చారు. అయితే సూపరింటెండెంట్ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయకుండానే సెలవుపై వెళ్లిపోయారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మస్తాన్‌బాషాకు ఉపాధ్యాయులను రమ్మన్న విషయం తెలియదు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు మెడికల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు ఎలాంటి పర్మిషన్ లేదు. దీంతో ఆయన కలెక్టర్‌తో మాట్లాడి వారి సూచనల ప్రకారం మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి పంపించారు. దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలు పడి వచ్చిన దివ్యాంగ ఉపాధ్యాయులకు తిప్పలు తప్పలేదు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

బాలాయపల్లి (సైదాపురం): బైక్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బాలాయపల్లి మండలంలోని కడగుంట–నిండలి మార్గంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి మండలం అమ్మపాళెం గ్రామానికి చెందిన నాగరాజు బైక్‌లో డక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి వెళ్తుండగా, నిండలి వద్ద అదుపుతప్పి నాగరాజు కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గూడూరు వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

నేడు వెల్లంపల్లి బోర్డుకు వైవీ సుబ్బారెడ్డి

మద్దిపాడు: గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వెల్లంపల్లి పొగాకు బోర్డును బుధవారం సందర్శించనున్నారు. ఆయనతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పలువురు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిలు హాజరు కానున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



దీక్ష చేస్తున్న కార్మికులు

రాపూరు: ఆర్టీసీలో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాపూరు డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి రమణయ్య డిమాండ్ చేశారు. రెండో రోజు మంగళవారం ఆర్టీసీ డిపో ఎదుట ఆ యూనియన్ కార్మికులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య, గ్యారేజ్ కార్యదర్శి సుధాకర్, వెల్డర్ శ్రీధర్, కార్మికులు శాంసన్, పెంచలయ్య, రమణయ్య, మోసే పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

• వీఎస్‌యూకు చేరుకున్న క్రీడాకారులు



వీఎస్‌యూ క్రీడా మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వేదికగా జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం నుంచి మే 3వ తేదీ వరకు జరిగే పోటీల్లో 94 మహిళా టీంలు పాల్గొననున్నాయి. మే 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరిగే పోటీల్లో 97 పురుషుల టీంలు తలపడనున్నాయి. ఈ పోటీల నిర్వహణను వీఎస్‌యూ అధికారులు ప్రతిష్టాత్మంగా తీసుకుని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రానికి వివిధ రాష్ట్రాల నుంచి మహిళా క్రీడాకారులు వీఎస్‌యూకు చేరుకున్నారు. కాసేపు క్రీడా మైదానంలో ప్రాక్టీస్ చేశారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు మొదటి మ్యాచ్‌లో తెలంగాణ యూనివర్సిటీ, స్వర్ణజిత్ గుజరాత్ స్పోర్ట్స్ యూనివర్సిటీ జట్లు తలపడనున్నాయి.

వైఎస్ జగన్ సమావేశానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షుల సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లాల అధ్యక్షుల సమావేశానికి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. మంగళవారం తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం జరిగింది. జిల్లాలో ప్రజల ఇబ్బందులు, రాజకీయ పరిస్థితులు, పార్టీ స్థితిగతులను అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో పార్టీ అధ్యక్షులే కీలకమని, పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలని, కార్యకర్తలకు బీమా, తదితర అంశాలపై జగన్‌మోహన్‌రెడ్డి సమావేశంలో వివరించారని ఆయన తెలిపారు.

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోండి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్ల కోసం మే 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఐటీఐల కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా iti. ap. gov. in దరఖాస్తును పూర్తి చేయాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో మే 26వ తేదీలోపు ధ్రువీకరణ చేయించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ జరిగే తేదీలను సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపుతారన్నారు. సందేహాలు ఉంటే వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐలో సంప్రదించాలన్నారు.